ప్లాస్టిక్‌పై సమరం.. నేటి నుంచి నిషేధం

- అమలాపురంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం
- సోమవారం నుంచి నిషేధాజ్ఞలు అమలు
- గతంలో పలు మార్లు చేసిన ప్రయత్నాలు విఫలం
- పటిష్ట చర్యలు చేపడితేనే సత్ఫలితాలు



అమలాపురంలో వర్తకులకు పర్యావరణహిత సంచులను చూపి అవగాహన కల్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు (ఫైల్)



అమలాపురంలో వ్యాపారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువుల నిషేధం అంశాన్ని వివరిస్తున్న మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్

అమలాపురం టౌన్: పర్యావరణానికి తీవ్ర హాని కలిగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులపై నిషేధం విధించి అమలాపురం మున్సిపాలిటీ సమరం శంఖం పూరించింది. పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను సోమవారం నుంచి పూర్తిగా నిషేధిస్తూ మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా ఈ ఉత్తర్వులను ఉల్లంఘించి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు విక్రయించినా, వినియోగించినా భారీగా జరిమానాలు వేస్తామని కమిషనర్ హెచ్చరించారు. పట్టణంలో ప్లాస్టిక్ వస్తువులు అంటే డిస్పోజబుల్ గ్లాసులు, ప్లేట్లు, పాలథిన్ కవర్లు తదితర వస్తువులను నిషేధించడం, అమలులో చేతులెత్తేయడం కొత్తేమీ కాదు. గతంలో నాలుగైదు సార్లు కమిషనర్లు పట్టణాన్ని ప్లాస్టిక్ రహితం చేయాలని ప్రయత్నించి విఫలమయ్యారు. చిత్తశుద్ధితో ఎక్కడా రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకుంటేనే ఈ నిషేధాజ్ఞలు సత్ఫలితాలనిస్తాయి.

డిస్పోజబుల్ వస్తువుల వాడకం ఇలా

పట్టణంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను విక్రయించే హోల్‌సేల్ షాపులు 18 వరకూ ఉన్నాయి. చిన్నాపెద్దా కలిపి దాదాపు 70 కిరాణా, ఫ్యాన్సీ తదితర దుకాణాల్లో ప్లాస్టిక్, పాలిథిన్ వస్తువులను విక్రయిస్తున్నారు. పట్టణ జనాభా సుమారు 54 వేల మంది. అమలాపురం పట్టణం జిల్లా కేంద్రమయ్యాక వివిధ పనులపై వచ్చే వేలాది మంది ఇక్కడ పలు దుకాణాల్లో ప్లాస్టిక్ సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో పట్టణంలోని ప్లాస్టిక్ వస్తువుల దుకాణాలకు బేరాల గిరాకీ బాగా పెరిగింది. వేడుకలు, ఇతర శుభ కార్యక్రమాలు నిర్వహించుకునే వారు ఎక్కువగా డిస్పోజబుల్ ప్లాస్టిక్ వస్తువులనే వినియోగిస్తుండడంతో వీటి డిమాండ్ బాగా పెరిగింది. అధికారులు హోల్ సేల్, రిటైల్ దుకాణాలపై దాడి చేసి ప్లాస్టిక్ వస్తువులను పట్టుకోవడం, జరిమానాలు విధించడం సాధారణమైపోయింది. మళ్లీ కొద్ది రోజుల తర్వాత షాపులకు ప్లాస్టిక్ సామగ్రి రావడం, ప్రజలు కొనుగోలు చేయడం సాధారణమైంది. చిన్న ఫంక్షన్ నిర్వహిస్తే చాలు నిర్వాహకులు ప్లాస్టిక్ వస్తువులను ఆశ్రయిస్తున్నారు. అరటి ఆకులు, మెటల్ గ్లాసులు, వస్త్ర, నార, కాగితపు సంచులు ఉపయోగించేందుకు ఓపిక, సమయం కేటాయించలేకపోతున్నారు. పాలథిన్ కవర్ల వాడకం మరీ ఎక్కువైంది. ఆఖరికి చిన్న టిఫిన్ సెంటర్‌కు వెళ్లినా, కూరగాయలు, చేపలు, మాంసం దుకాణానికి వెళ్లినా ఆ వ్యాపారి పాలథిన్ కవర్ల ఇస్తేనే అతని వద్ద కొనుగోలుకు వినియోగదారులు ఆసక్తి చూపుతున్నారు. వినియోగదారులు అడిగి మరీ కవర్లు తీసుకుని ఆ వస్తువులను అందులో వేసుకుంటున్నారు.

మూలాలను మట్టుబెట్టకుండా

పట్టణంలోని డిస్పోజబుల్ ప్లాస్టిక్ వస్తువుల హోల్‌సేల్, రిటైల్ షాపులపై ఎన్ని దాడులు చేసినా, ఎన్ని తనిఖీలు చేసినా, ఎంత మేర జరిమానాలు విధించినా ఆ వ్యాపారాన్ని పూర్తిగా అరికట్టలేని పరిస్థితి నెలకొంది. షాపులకు కొన్ని రోజుల తర్వాత డిస్పోజబుల్ వస్తువుల తయారీ పరిశ్రమల నుంచి సరఫరా కావడం, అమ్మడం పరిపాటే అవుతోంది. అసలు ఈ షాపులకు సరఫరా చేసే తయారీ సంస్థలను నిషేధించే వరకూ, లేదా సరఫరాను ఆది నుంచి నిలిపే వరకూ ఈ క్రయ విక్రయాలు కొనసాగుతూనే ఉంటాయి. పరిశ్రమల ప్లాస్టిక్ సామగ్రి తయారీ, ఎగుమతులు, సరఫరాలను నిలిపివేయనంత కాలం ఇది ఇలాగే కొనసాగుతుంది. మూలాల జోలికి వెళ్లకుండా పట్టణంలోని హోల్‌సేల్, రిటైల్ షాపులు, హోటళ్లు, కిరాణా దుకాణాలపై అధికారులు దాడులు, తనిఖీలు చేస్తే తాత్కాలిక ఫలితాలే వస్తాయని పలువురు అంటున్నారు. ఈ అనుభవ పాఠాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు పటిష్ట చర్యలు చేపడితే సత్ఫలితాలు సాకారమవుతాయని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు.



వినియోగదారుల్లో మార్పు రావాలి

వివిధ కొనుగోళ్ల నిమిత్తం బజార్లకు వెళ్లే వినియోగదారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదని, పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలనే చైతన్యం ఉండాలి. పాలథిన్ కవర్లకు బదులు బజారుకు వెళ్లేటప్పుడే వస్త్ర సంచి లేదా కాగితపు సంచి వెంట తీసుకుని వెళితే పాలథిన్ కవర్ల నిషేధం మన చేతుల నుంచే మొదలవుతుంది. బజార్లలో విక్రయాలకు సిద్ధంగా ఉంటున్న నార, వస్త్ర, కాగితపు సంచలను కొనుగోలు చేసి పాలథిన్ కవర్లకు ప్రత్యామ్నాయంగా వినియోగించే దిశగా అలవాటు పడితే అధికారుల తనిఖీలు, జరిమానాల తలనొప్పి కూడా ఉండదు. మున్సిపల్ అధికారులతో పాటు పట్టణంలోని 15 వార్డుల సచివాలయాల్లోని పర్యావరణ కార్యదర్శులకు, అధికారులకు కూడా తనిఖీలు చేసి జరిమానాలు విధించే పని ఉందన్న విషయాన్ని ప్రజలు గుర్తెరగాలి.

క్లుప్తంగా

అన్నదాన ట్రస్ట్‌కు విరాళం



దాతకు స్వామిచిత్రపటం, శేషవస్త్రం అందజేస్తున్న ఆలయ అర్చకులు

ఐ పోలవరం: మురమళ్లలోని వీరేశ్వరస్వామి ఆలయం అన్నదాన ట్రస్ట్‌కు ఆదివారం భక్తుడు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా అమలాపురానికి చెందిన పెదమల్లు రామారావు దంపతులు రూ.10,116 వీరేశ్వర అన్నదాన ట్రస్ట్‌కు అందించారు. దాత దంపతులకు స్వామి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం అందించి సత్కరించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో దాతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వాహణాధికారి వి.సత్యనారాయణ దాతను అభినందించారు.

వెంకన్న దేవస్థానం ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్

అమలాపురం టౌన్: అమలాపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి నూతన ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్ విడుదలైందని ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు. ధర్మకర్తల బాధ్యతలు స్వీకరించేందుకు ఆసక్తి గల వారు 20 రోజుల్లోపు జిల్లా దేవదాయ శాఖ అధికారికి (అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో) దరఖాస్తులను అందజేయాలని ఈవో సూచించారు. దేవదాయ శాఖ నుంచి విడుదలైన నోటిఫికేషన్ పత్రాన్ని దేవస్థానం నోటీసు బోర్డులో ఉందని, వివరాల కోసం దేవస్థానం కార్యాలయాన్ని సంప్రదించాలని ఈవో సూచించారు.

నేడు జాబ్ మేళా

అమలాపురం టౌన్: అమలాపురం నల్లా చారిటబుల్ ట్రస్ట్, శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ల్యాబొరేటరీ సంస్థ సోమవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు నల్లా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ నల్లా పవన్‌కుమార్ తెలిపారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో 2024 లేదా 2025లో మొదటి ప్రయత్నంలోనే ఎంఎస్సీ లేదా బీఎస్సీ పూర్తి చేసి కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు హాజరుకావాలని ఆయన సూచించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఏవో కరాటం ప్రవీణ్ విజ్ఞప్తి చేశారు. వివరాలకు రిలయన్స్ ఫౌండేషన్ టోల్ ఫ్రీ నంబరు 18004198800ను సంప్రదించాలని సూచించారు.

వైభవంగా పరదేశమ్మ తీర్థం



పరదేశమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తాళ్లరేవు: గ్రామదేవత పరదేశమ్మ తీర్థం ఆదివారం తాళ్లరేవులో వైభవంగా నిర్వహించారు. అమ్మవారి జాతర శనివారం గరగ నృత్యాలు, డప్పుల వాయిద్యాలు, శక్తివేషాలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక మార్కెట్ వీధిలోని అమ్మవారి అంగన్‌గుడి నుంచి కొత్త అమ్మవారిని ఊరేగింపుగా, డప్పుల వాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఆలయానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తాళ్లరేవు పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కు చెల్లించారు.

భూ తగాదాపై పోలీసులకు ఫిర్యాదు

ముమ్మిడివరం: వారసత్వంగా లభించిన ఆస్తిని కొందరు వ్యక్తులు దస్తావేజు లేఖరు సాయంతో కుట్రపూరితంగా మోసం చేసి కాజేయాలని దురుద్దేశంతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ముమ్మిడివరం మండలం లంకాఫ్టర్‌కు చెందిన కొప్పిశెట్టి వేణుగోపాలకృష్ణ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. లంకాఫ్టర్‌లో 98 సెంట్లు వారసత్వంగా లభించిన భూమిని తన తోపాటు విశ్వేశ్వరరావు ఆస్తి పంపకాల పారికత్తు రాయించుకున్నామని వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఆస్తికి సంబంధిచి అన్ని ఆధారాలు ఉన్నాయని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. తమ గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ఆ భూమిని ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, దీనిపై విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని వేణుగోపాలకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

తాళ్లరేవు: సుంకరపాలెం జంక్షన్‌లోని ఒక లాడ్జిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం రాత్రి అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు తమకు అందిన సమాచారంతో దాడిచేసి ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.27,600 నగదు, ఏడు సెల్‌ఫోన్లను స్వాధీన చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సత్యనారాయణ తెలియజేసారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

విద్యారంగం ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వ చర్యలు

మాజీ ఎమ్మెల్సీ ఐవీ ఆందోళన



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

అమలాపురం టౌన్: విద్య రంగాన్ని ప్రైవేటీకరణ చేసే దిశగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, యాప్‌లతో ఉపాధ్యాయులపై అదనపు భారాన్ని మోపుతోందని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ) ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంప్లాయిస్ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఐవీ మాట్లాడారు. తొలుత ఎంప్లాయిస్ హోమ్ ఆవరణలో యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో యూటీఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు చేయడమే కాకుండా విద్యాభివృద్ధికి తన వంతు కృషి చేస్తోందని జిల్లా అధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, సహాధ్యక్షుడు జీవీ రమణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు పెన్నాడ శ్రీనివాస్, టి.దుర్గా ప్రసాద్, కె.శ్రీనివాస్, బి.చంద్రకళ, అమలాపురం పట్టణ ముఖ్య బాధ్యులు కె.వెంకటేశ్వర్లు, బీఎస్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అమలాపురంలో నేడు ఉపకరణాల శిబిరం

అమలాపురం రూరల్: రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో జిల్లా సహిత విద్యలో భాగంగా అమలాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రత్యేక శిబిరం నిర్వహిస్తునట్లు జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, మామిడికుదురు మండలాలకు సంబంధించి దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాల అందించేందుకు నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం



గొల్లవిల్లిలో స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా కలసి ఆదివారం ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. స్నేహమంటే ఆనందంలోనే కాదు కష్టాల్లోనూ పాలు పంచుకోవాలని ఆత్మీయ వేదికపై తీర్మానించుకున్నారు. స్నేహితుల కష్టసుఖాల్లో తోడుంటామని వారన్నారు. గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రు గ్రామానికి చెందిన అరవ వీరవెంకటసత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తెతో పాటు వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు ఉన్నారు. కుటుంబ భారాన్ని మోసే పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతోంది. స్నేహితుని కుటుంబ పరిస్థితి తెలుసుకున్న పదో తరగతి స్నేహితులంతా రూ.లక్ష ఆర్థిక సాయాన్ని కూడబెట్టి ఆదివారం సత్యనారాయణ కుటుంబ సభ్యులకు అందించారు. బాల్య స్నేహితుని మృతి సానుభూతిని తెలిపి సత్యనారాయణ కుటుంబాన్ని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డి రాంబాబు, కోడూరి పల్లంరాజు, మారిశెట్టి నాగకృష్ణమూర్తి, సలాది తాతారావు, గనిశెట్టి చిరంజీవి, ఆదివారపుపేట చిన్నారావు, బొంతు చిట్టిబాబు, పాలకొల్లు సుబ్రహ్మణ్యం, బిక్కిన ఏసుబాబు, గుత్తుల రాజు, మారిశెట్టి దుర్గారావు, చిప్పాడ ప్రసన్న, జిన్నూరి నాగబాబు పాల్గొన్నారు.

తీరప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలి



సావిత్రి నగర్‌లో మత్స్యకారులతో మాట్లాడుతున్న కోస్టల్ పోలీసులు

యానాం: స్వాతంత్ర్య దినోత్సవాల నేపథ్యంలో సముద్రంలో ఉగ్రవాదుల కదలికలపై తీరప్రాంత మత్స్యకార ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోస్టల్ పోలీస్ శాఖ అధికారులు అన్నారు. యానాం నియోజకవర్గ పరిధిలో సావిత్రినగర్‌లో ఆదివారం స్థానికులతో కోస్టల్ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సద్భావన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ సముద్ర తీరప్రాంతం నుంచి ఉగ్రవాదులు ప్రవేశించే అవకాశం ఉన్నందున చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు అనుమానాస్పదంగా ఓడలు, కొత్త వ్యక్తులు ఎవరైనా సంచరిస్తే వాటి సమాచారాన్ని కోస్టల్ పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో కోస్టల్ ఎస్సై రమణమూర్తి, ఎస్సై పట్టాభిరామయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుదర్శనబాబుకు ఘన నివాళి



సుదర్శనబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఐ.పోలవరం: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దివంగత భూపతిరాజు సుదర్శనబాబురాజు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఐ.పోలవరం మండలం పాత ఇంజరంలోని సుదర్శనబాబు విగ్రహానికి మాజీ సర్పంచ్ కొండేపూడి వరప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈప్రాంత ప్రజలకు సుదర్శన బాబు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కొర్లపాటి ప్రసాద్, దంగుడు బియ్యం వెంకట రామయ్య, రేవు యజ్ఞశ్రీ, సాదనాల బాబూరావు, పులపకూర కొండబాబు, పులపకూర రమణ, సానబోయిన నాగేశ్వరరావు, చప్పిడి బుజ్జిబాబు గొల్లపల్లి విష్ణు పాల్గొన్నారు.

బోద నివారణే లక్ష్యంగా వైద్య పరీక్షలు



నైట్ క్లినిక్‌పై అవగాహన కల్పిస్తున్న హెల్త్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు

అమలాపురం టౌన్: జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ (ఎన్ఎఫ్‌సీపీ) కార్యక్రమంలో భాగంగా బోద వ్యాధి ప్రజలకు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా అమలాపురం పట్టణం ఏవీఆర్ నగర్‌లోని ఫైలేరియా ఆఫీసులో ప్రతి మంగళవారం రాత్రి 6 నుంచి 10 గంటల వరకూ నైట్ క్లినిక్ పేరుతో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు హెల్త్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాదరావు తెలిపారు. కార్యాలయంలో బోద నివారణపై ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రసాదరావు మాట్లాడారు. ఉచితంగా రక్త పరీక్షలు, మందులు ఇస్తామని తెలిపారు. ఈ బోద వ్యాధి ఆడ క్యూలెక్స్ దోమ ద్వారా మనుషులకు వ్యాపిస్తుందన్నారు. వ్యాధిగ్రస్తుడి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే అవకాశం కూడా ఉందని పేర్కొన్నారు. బోద వ్యాధి నిర్ధారణ పరీక్షలు ప్రతి మంగళవారం అమలాపురంలోని ఏవీఆర్ నగర్‌లో ఎన్ఎఫ్‌సీఎల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న తెలిపారు. నైట్ క్లినిక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గనిశెట్టి రమణలాల్, తుట్టపు సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం



బీఎస్ఐ జిల్లా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ముమ్మిడివరం: ప్రపంచానికి శాంతి సందేశాన్ని అందించిన బుద్ధుని బోధనలు అనుసరణీయమని బుద్ధిస్టు సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎస్ఎస్ఆర్ భూపతి పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు పెనుమాల సుధీర్ అధ్యక్షతన శ్రావణ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత గౌతమ బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పుష్పాలు అర్పించి పంచశీల పాటించారు. ఈ సందర్భంగా భూపతి మాట్లాడుతూ బుద్ధుడు మానవాళి మనుగడకు శీలం, ప్రజ్ఞ, సమాధి సిద్ధాంతాల ద్వారా సమాజానికి శాంతిని పంచారన్నారు. అనంతరం జిల్లా బీఎస్ఐ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎనున్నకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కేవీవీ సత్యనారాయణ(డ్రాయింగ్ మాస్టార్), ఉపాధ్యక్షుడిగా మాగాపు ఈశ్వరరావు, యలమంచిలి సురేష్, జనరల్ సెక్రటరీగా బుడితి బాబు రాజేంద్రప్రసాద్, జేవీవీ సత్యనారాయణ, తరపట్ల వెంకటేశ్వరరావు, కోశాధికారిగా కేవీవీ సత్యనారాయణ(కవి) నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యుడిగా చింతపల్లి శివకుమార్, కాట్రు అప్పారావు, కొట్టాల నరసింహరావు, జల్లి బాలకృష్ణ, కుంచె చిన బాబు, దడాల రాజశేఖర్ నియమితులయ్యారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు

యానాం: పట్టణ పరిధిలో బైపాస్ రహదారి, పట్టణ ప్రాంత రహదారుల్లో బహిరంగంగా మద్యం తాగుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దుకాణాల ఎదురుగా మద్యం సేవిస్తే దానికి సంబంధిత షాపు యజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అటువంటి ఘటనలపై తక్షణం పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా సాయంత్రం సమయంలో పలువురు యువత మద్యానికి బానిసై రహదారులపై బాహాబాహీకి దిగుతున్నారని అవి ఘర్షణలకు దారితీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజీవ్‌బీచ్‌లో బైక్ రేస్‌లు, వాహనాలను వేగంగా నడుపుతూ ప్రమాదాలబారిన పడి ఒక్కోసారి మృతి చెందుతున్నారని, అటువంటి వాటిపై పోలీసుశాఖ చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవలి ఇద్దరు మద్యం తాగిన మైకంలో జరిగిన గొడవను రాజకీయం చేయడం తగదని సోషల్‌మీడియా ద్వారా కులవిభేధాలు సృష్టించడం మాని అందరూ సోదర భావంతో మెలగాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ హితవు పలికారు.

లవ్ అండ్ హోప్ సేవలు అభినందనీయం



బిళ్లకుర్రులో కిరాణా సరకుల కిట్లు అందజేస్తున్న సర్పంచ్ లక్ష్మీపతిరావు, నానిబాబు

కొత్తపేట: సమాజంలో పేద వితంతువులకు, అనాథ పిల్లలకు లవ్ అండ్ హోప్ ఫౌండేషన్ సేవలు అభినందనీయమని బిళ్లకుర్రు సర్పంచ్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు అన్నారు. మండలంలోని బిళ్లకుర్రులో లవ్ అండ్ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వితంతువులు, అనాథ పిల్లలకు చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ నెల్లి నానిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీపతిరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి నెలా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం 20 మంది వితంతువులకు, పలువురు అనాథ చిన్నారులకు కిరాణ సరకుల కిట్లను లక్ష్మీపతిరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. దాతలు ముందుకు వచ్చి చేయూతనిస్తే భవిష్యత్తులో మరింత మందికి సేవలందిస్తానని నానిబాబు అన్నారు. సంస్థ సభ్యుడు కిరణ్ పాల్గొన్నారు.

జీఓ 5కు వ్యతిరేకంగా చలో పుదుచ్చేరి



చలో పుదుచ్చేరికి బస్సులో పయనమవుతున్న దళిత సంఘ నేతలు

యానాం: ఎస్సీల సంక్షేమ పథకాలకు విఘాతంగా మారిన జీఓ 5ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ, ఎస్టీ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో దళితులు ఆదివారం ప్రత్యేక బస్సులో చలో పుదుచ్చేరికి పయమై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ యునైటెడ్ ఫోరం అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి, రిటైర్డ్ ఆర్ఏఓ గిడ్డి బలరాం మాట్లాడుతూ ఆది ద్రావిడ శాఖ జారీ చేసిన జీఓ 5 వల్ల దళితులకు సంక్షేమ పథకాలలో కోత విధిస్తున్నారని, ప్రస్తుతం పొందే పథకాలపై కొత్తగా ఆర్థికపరమైన పరిమితులు నిబంధనలు విధించడంతో ఎస్సీ, ఎస్టీలు పథకాలు అర్హులు కాలేకపోతున్నారన్నారు. ఈ సమస్యపై ఇప్పటికే యానాంలో భారీ ధర్నా నిర్వహించామని, రాజధాని పుదుచ్చేరిలో ప్రభుత్వానికి తెలిసేలా ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఎల్జీ కైలాసనాథన్‌కు, సీఎం రంగసామికి వినతిపత్రం ఇస్తామని నాయకులు తెలిపారు.

ఎస్ఏఎఫ్ ద్వారా ఆర్థిక సాయం

అంబాజీపేట: చిరతపూడి శివారు చినపాలెంలో గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న పితాని రమేష్‌కు శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో రూ.30 వేలు ఆర్థిక సాయం ఆదివారం అందజేశారు. రమేష్ పరిస్థితిని కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకువెళ్లారు. దాంతో వైద్య ఖర్చుల నిమిత్తం మంత్రి సుభాష్ రూ.20 వేలు, ఎస్ఏఎఫ్ సభ్యులు సమకూర్చిన రూ.10 వేల నగదును సమకూర్చి రమేష్‌కు అందజేశారు. కార్యక్రమంలో దొంగ శ్రీను, సంసాని బాలాజీ, చిట్టూరి శ్రీనివాస్, గుత్తుల రాము, మొల్లేటి శ్రీను, కాండ్రేగుల రాము, యనమదల మహేష్, విత్తనాల నాగకిషోర్ పాల్గొన్నారు.

రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తాం



మెట్ల కాలనీలో వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ భీమరాజు

అంబాజీపేట: వాహనాలకు ఎటువంటి రికార్డులు సక్రమంగా లేకపోయినా వాటిని ఆర్టీవో కార్యాలయానికి తరలించి సీజ్ చేస్తామని పి.గన్నవరం సీఐ ఆర్.భీమరాజు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో సీఐ భీమరాజు పర్యవేక్షణలో అంబాజీపేట మెట్లకాలనీలో ఆదివారం తెల్లవారుజామున ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సీఐ భీమరాజు మాట్లాడుతూ తనిఖీల్లో రికార్డులు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనాలకు సంబంధించి సరైన పత్రాలు చూపించాల్సి ఉందన్నారు. రికార్డులు సక్రమంగా ఉన్న వాహనాలను ఆయా యజమానులకు అందజేస్తామన్నారు. రికార్డులు లేని వాటిని బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మారుమూల సారా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలు నివారించేందుకు ఇకపై ఆకస్మిక తనిఖీలు తరచూ కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎస్సై కె.చిరంజీవి, ట్రైనింగ్ ఎస్సై గుబ్బల సోమేంద్ర, ఏఎస్సైలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.